ఆ రైలు ఇక రాదు

సుమన్

ఒగర్చుకొంటూ వచ్చి ఆగింది రైలు. పెట్టెల కడుపులోనుంచి నెట్టివేయబడుతున్నారు. కొంచంపేపు అంతా హడావిడి- పోర్టర్ల కేకలు-రిక్షావాళ్ళ అరుపులు....

నిశ్శబ్దాన్ని వికృతంగా హత్య చేస్తున్నాను.

జయమ్మ మనుషుల్ని తోసుకొంటూ కంగారుగా వేగంగా పెట్టెలకేసి వెళ్తోంది. మనుషుల ముఖాల్లోకి పరిశీలనగాచూస్తోంది వెతుక్కొంటూ. కొన్ని నిమిషాలు ప్లాట్ ఫారం కలియతిరిగిన తర్వాత పెట్టెల్లో వెతకసాగింది. ఆమె కళ్ళు చాల ఆమర్దాగా, తొందరగా వెతికాయి. ఎక్కడా ఆమెకు కావలసిన వ్యక్తి దొరకలేదు.

ఆమె కళ్ళల్లో నిరాశ విసుగు చేరి సగం పంచుకొని ఒళ్ళు కప్పుకున్నాయి.

సేదతీరింది కాబోలు రైలు ఈసారి సంతోషంగా అరిచి ముందు కొంచం నెమ్మదిగా తరువాత వేగంగాదూసుకొంటూ దూరాన వంగిన మబ్బుల్లోకి దూసుకుపోయింది.

వెళ్తున్న ఆ బండివంక చాలసేపు చూస్తూ వుండిపోయింది జయమ్మ. తరువాత ఆమె కళ్ళు ఎరుపురంగు పులుముకున్నాయి. వెంటనే తెల్లటి నీటిచుక్కలు క్రింది రెప్పలను పొర్లుకొంటూ చితికిపోతూ జల జల రాలాయి.

నెమ్మదిగా నడిచి చెట్టుక్రింద సిమెంటు అరుగుమీద కూర్చుంది. అక్కడే వున్న పాత పెట్టెలో చింపిరిగుడ్డల్ని, పాతకాగితాలను అటుయిటు పిచ్చిగా తన ఒణుకుతున్న చేతులతో కదిలించసాగింది.

ఇలా నేను ప్రతిరోజూ చూస్తున్నాను. రైలు దూరాన కూయగానే జయమ్మ పరుగెత్తుకు రావటం. ఆదుర్దాగా ఆశగా ఎవరికోసమో వెతకటం - నిరాశపడి ఏడ్వటం ప్రతిరోజూ జరిగేదే ...

జయమ్మ ఎందుకిలా చేస్తోంది? నేను చాల రోజులనుంచి వేసుకొంటున్నప్రశ్న.

మళ్ళా జయమ్మకేసి చూశాను. బైరాగి కాబోలు ఏడుస్తున్న జయమ్మతో ఏమిటో చెప్తున్నాడు. బైరాగి బిచ్చగాడు. అప్పుడపుడు తను అడుక్కు వచ్చిన దాంట్లో కొంత జయమ్మకు పెడుతూవుంటాడు.

జయమ్మ పిచ్చిది. శరీరంమీద పీలికల గుడ్డలు వాటిచాటున మరీ చీలికల్లా ముడుతల గీతలు-తల చిందరవందరగా చెదరి అక్కడక్కడ యింత రాగి రంగు, మరి కొంత తెల్లరంగు పులుముకుంది.

ఆమె రోజూ ఆ రకంగా రైళ్ళు వెతకటం-ఆమె చేష్టలు, ఆమెనవ్వు, ఏడ్పు చూసి పిచ్చిదిగా పేరు పొందింది.

గుడవల్లేరు స్టేషను పెద్దదేమి కాదు. చాల చిన్నది. కాని, వచ్చిపోయే ప్రతి రైలు యిక్కడ ఆగుతుంది.

అక్కడక్కడ ఎత్తుగా గుబురుగా పెరిగిన చెట్లు-వాటి మధ్య సన్నగా నిలువుగా పాతిన ఎలక్ట్రిక్ స్తంబాలు - మనుషులు కూర్చోటానికి వేసిన రాతి అరుగులు-ఓ చిన్న బంగళాపెంకు దాబా— దానిని ఆనుకొనే కాంటీన్ — ఇది రైలు స్టేషను. స్టేషనుకు రెండోపక్క ప్లాట్ ఫారం లేదు. లారీలు, బళ్ళు నడిచిన గోతులు లోతుగా వికృతంగా వుంటాయి

అక్కడక్కడ పెరిగిన పిచ్చిమొక్కలు. పడి కాళ్ళు చేతులు విరగొట్టుకున్న రాళ్ళు రెండోప్రక్క స్టేషనుకు మిగిలినవి.

జయమ్మ ఏదో బిగ్గరగా అంటోంది. ఏమిటో అర్ధంకావటంలేదు. కొంచంసేపు ఏవో కూనిరాగాలు తీసింది. తరువాత ఏడ్చింది. జుట్టు పీక్కుంది. తుప్పు పెట్టె లోని కాగితాలు చిందరవందరగా విసర సాగింది. బైరాగి ఆమెను పట్టుకొని కూర్చోపెడుతున్నాడు.

జయమ్మ బైరాగిని తోసి లేచి వెళ్ళి రైలు పట్టాలవంక చూడసాగింది.

* * *

రాత్రి పది దాటింది. చలిగాలి శరీరాన్ని తీవ్రమనిపించుతోంది. రైలు స్టేషనుకు వెళ్ళాలనిపించింది. వేళ్ళవరకు స్వెట్టర్ లాక్కుని తలచుట్టూ మఫ్లర్ చుట్టుకొని గదినుంచి బయలుదేరాను.

స్టేషనులో చెట్లమధ్య వెలుగుతున్న లైట్లచుట్టూ పురుగులు దాగుడుమూతలాడు తున్నాయి. చెట్లపైన చీకటి క్రింద లైట్ల వెలుగు అక్కడక్కడ చీకటి వెలుగులు కొట్టుకుని మిగిల్చిన ముక్కలు.

రావిచెట్టు క్రింద సిమెంటు అరుగుమీద జయమ్మ వుంది ప్రక్కనే బైరాగి కూర్చు న్నాడు. బైరాగి అన్నం గిన్నెలో పెట్టి పులుసుపోసి జయమ్మ ముందు పెట్టాడు. జయమ్మ ముందు అన్నంవంక పిచ్చిగా చూసింది. తరువాత కొద్దిగా నోట్లో పెట్టు కొని తింటూ అటుయిటు చూడసాగింది. ఆమే తింటూవుంటే బైరాగి కళ్ళల్లో ఏదో తృప్తి ఆక్రమించుకొంటోంది. నల్లగా వున్న అతని ముఖంలో వెలుగు కనబడు తోంది. బైరాగి రోజూ ఊళ్లోఅడుక్కొని జయమ్మకు పెట్టి మిగిలింది తనుతింటాడు. నివాసం ఎండ, వాన చలుల క్రింద ఆ స్టేషనులోనే.

జయమ్మకు బైరాగి ఏమవుతాడో ఎవ రికీ తెలియదు. అడిగితే "ఏదో పిచ్చిది- నాలుగు మెతుకులు పెడితే పుణ్యమే కాని పాపంకాదుగా బాబయ్యా" అంటూ వుంటాడు. దానికి నాకు ఏమీ చుట్టరికం లేదు అంటూ వుంటాడు.

జయమ్మ అన్నం తిన్న తర్వాత ఆ గిన్నె తీసుకువెళ్ళి పంపుదగ్గర కడిగాడు. అందులోనే కాసిని నీళ్ళు తీసుకువచ్చి జయమ్మకు త్రాగించాడు. సిమెంట్ అరుగు మీద గుడ్డతో దుమ్ము దులిపాడు. జయమ్మ అక్కడ పడుకుంది. తన భుజంమీదవున్న పాత దుప్పటి జయమ్మమీద కప్పి నా దగ్గరగా వచ్చి అన్నాడు "ఏటి బాబయ్యా నిలబడిపోయినారు. పిచ్చిదంటే మీకు ధ్యాసగా వుందే."

"కాదు, బైరాగి ఏమీతోచక యిటు వచ్చాను."

"ఎటో పిచ్చిది బాబూ అట్టా చూస్తూ వుంటుంది వచ్చే రైలు పోయేరైలు-దాని ప్రాణం అట్టా పోవాల్సిందే."

"ఎవరికోసం చూస్తూ వుంటుంది బైరాగి" అడిగాను.

"పిచ్చిదిబాబూ-దాని చేష్టలు అంతే— ఎవరికోసం చూస్తుంది?" గొణిగినట్లుగా చెప్పాడు బైరాగి. అలా అనేటప్పుడు కళ్ళల్లో బాధ అలవోకగా తొంగిచూసింది. దానిని కనబడనీయకుండా తలదించుకొని చిరుగుల జేబులోనుంచి బీడీ తీసి నోట్లో పెట్టుకున్నాడు. నేను అగ్గిపెట్టె యిచ్చాను. బీడి వెలిగించి పొగవదిలాడు.

పైన మంచు కురుస్తోంది కాబోలు బాగా చల్లబడిపోయింది. "వెళ్ళిపడుకోండి బాబూ పొద్దోయింది. నేనూతొంగుంటాను" అన్నాడు బైరాగి వెనుతిరుగుతూ.

చెట్టుక్రింద పడుకున్న జయమ్మ చలికి వణుకుతోంది. బైరాగి దుప్పటి సరిచేసి తను కొంచెం దూరంగా ముడుచుకొని పడుకున్నాడు.

నేను సిగరెట్ వెలిగించాను. ఆచలిలో సిగరెట్ చాలా వెచ్చగా హాయిగావుంది. ఆ సమయంలో పెదవులకు సిగరెట్ఇచ్చే వేడి మరేదీ యివ్వలేదేమో.

ఆలోచించుకొంటూ గదికి బయలు దేరాను.

నేనుండే గది స్టేషనుకు చాలదగ్గర. నా గదిలోనుంచి స్టేషనును చూడగలను. రోజూ స్టేషనువంక చూడటం - జయమ్మ కోసం కళ్లు వెతకటం అలవాటుగా మారి పోయింది. జయమ్మ రైళ్ళు వెతకటం అలవాటుగా మారిపోయింది జయమ్మ రైళ్ళు వెతకటం గురించి నేను చాలా రకాలుగా అనుకునేవాడ్ని. భర్త వదిలి వెళ్ళిపోయి వుంటాడు. లేదా కొడుకు తల్లిని వదిలివేసి ఎక్కడికో పారిపోయి వుంటాడు. అందుకోసం మనసు చెదరి అలా వెతుకుతూ వుండివుంటుంది. ఇంకా ఎవరినన్నా బంధువుల్ని పోగొట్టుకుందేమో.

జయమ్మ పట్ల నాకు పూర్తిగా జాలి ఏర్పడింది. అపుడప్పుడు స్టేషనుకు వెళ్ళి నేను జయమ్మకు బిస్కట్లు. కాయిని. రొట్టెలు యిస్తూ వుండేవాడిని. జయమ్మ ఏమీ మాట్లాడేదికాదు. నేను యిచ్చేవి తీసు కొనేది. ఒక్కొక్కసారి కళ్ళనీళ్ళు నింపు కొని చూసేది. మరొకసారి నేనిచ్చినవాటిని తన పాత పెట్టెలో వేసి అటుయిటు చేతు లతో ఆకించుకూ వుండేది.

నేను అవి యిస్తున్నపుడు బైరాగి అంటూ వుండేవాడు "ఎందుకు బాబూ యివన్నీ."

అయినా నేను ఆగేవాడినికాదు.

బైరాగి శ్రమను చూసి నేను చాలా ఆశ్చర్యపోయేవాడిని మరో బిచ్చకత్తె కోసం బైరాగి అకుక్కుని పోషించటం నిజంగా ఆశ్చర్యమే కల్గించుతుంది.

మనిషిపట్ల మరోమనిషికి ఏర్పడే సానుభూతి ఎంత అందమైనది.

పేవ్‌మెంట్లమీద కుంటుతూ నడిచే బిచ్చగాళ్ళ మధ్య అందమైన సానుభూతి- అందంగా వెలిగే తృప్తి ...

అవి ఈ దేశంలో ఎంతమంది లక్షాధి కారులు పొందుతున్నారు?

నా మనసులో తిరుగుతున్న ప్రశ్న

ఒక్క_కే-జయమ్మ ఎవరికోసం రైళ్ళు వెతుకుతోంది. ఆ పిచ్చి మనసులోనుంచి ఏమీ బయటకు రాదు. ఆమె ఎవరో ఎక్క_డనుంచి వచ్చిందో-ఎందుకు రైళ్ళు వెతుకుతూవుందో బైరాగితోసహా ఈ ఊళ్లో ఎవరికి తెలియదు. కాని, తెలుసు కోవాలి-అపుడే యీ మనసుకు తృప్తి లభించుతుంది.

* * *

గది తలుపులమీద చప్పుడైతే తలు పులు తీశాను. ఎదురుగా బైరాగి నిలబడి వున్నాడు. బయట అంతా చీకటి నల్లగా ముద్దగా అయింది.

బైరాగి ఆదుర్దాగా వున్నాడు. అతని ముఖమంతా చెమటబిందువులు చోటు చేసు కున్నాయి.

"బాబూ జయమ్మ బ్రతికేట్లులేదు. మీరు సాయంచేయాలి."

"ఏమిటి? జయమ్మ కేమయింది?" నేను మరింత కంగారుగా అడిగాను

"ఆఖరి బండి రాగానే వెతుక్కొ_ంటూ ఎక్కి_ంది. కదిలేటప్పుడు దిగిపోయింది. కాలుజారి ప్లాట్‌ఫారమ్‌మీన పడిపోయింది. చాల రక్తం కారిపోయింది బాబూ -ఇంత దయ చూపిన మారాజు లేడు నేను దాన్ని చెట్టుక్రిందకి చేర్చి మీ దగ్గరకు పరుగెత్తు కొచ్చాను"

బైరాగి చాల కంగారుగా వున్నాడు. భయంతో ఒణుకుతున్నాడు. గది తలుపులు వేసి టార్చి తీసుకొని అతని వెనుకే వెళ్ళాను. స్టేషను చేరేసరికి ఐదు నిమి షాలు పట్టింది.

జయమ్మ సిమెంటు అరుగు మీద వెల్ల కిలా పడి వుంది టార్చి వేసి చూశాను. ముఖం మీద దుమ్ము కొట్టుకు పోయింది. గాయం నుంచి రక్తం కారుతోంది. నోటిలో నుంచి కూడా రక్తం కారు తోంది. ముక్కు_ మీద కూడ దెబ్బ బాగానే తగిలింది కాబోలు రక్తం చెమర్చుతోంది.

జయమ్మలో చలనం లేదు.

స్టేషను బయటకు చూశాను. బయట రిక్షా వుంది, అందులో రిక్షావాడు ముడుసు కొని పడుకున్నాడు. వాడిని లేపి నేను బైరాగి రిక్షావాడు కలసి జయమ్మను రిక్షాలో పడుకోబెట్టాము ఆమెను పట్టు కొని బైరాగి కూర్చున్నాడు.

నేను వెనుకే చిడవసాగాను.

హాస్పిటల్ చేరేసరికి మరోపావుగంట పట్టింది. డ్యూటీలో వున్న నర్సు ఎదు రుగా వచ్చి రిక్షాలో వున్న పేషెంటును చూసి 'డాక్టరుగారు యింటి దగ్గర వున్నారు' అంది.

'ఇంటికి ఫోన్ చేయి" అన్నాను నేను.

మరో పావుగంటలో డాక్టరు కారు వచ్చి హాస్పిటల్ ముందు ఆగింది. బైరాగి సహాయంతో జయమ్మను లోపలకు తీసుకు వెళ్ళి పడుకోబెట్టాను,

జయమ్మలో చలనం లేదు. రక్తం కారుతూనే వుంది.

డాక్టరు పరీక్షించుతున్నాడు. తెల్లద్దాల కళ్ళలో నుంచి బద్ధకంగా వున్న ఆయన కళ్లు గంభీరంగా మారాయి.

పైన తెల్లటి బల్బు వూపిరి బిగబట్టి చూస్తోంది. ఫాను ఛాల కంగారుగా అదు ర్దాగా వేగంగా తిరుగుతోంది.

"హోప్‌లెస్-అయినా ట్రై చేద్దాము - రక్తం ఎక్కించాలి' డాక్టరు అన్నారు నాకేసి చూస్తూ.

"ఎలాగైనా ఆమెను బ్రతికించండి. ఎంతయినా ఫర్లేదు" అన్నాను నేను.

క్షణాల్లో జయమ్మ రక్తం పరీక్షిం చటం-స్టాండు ఎరేంజి చేయటం జరిగి పోయింది. పైన బాటిల్‌లో నుంచి ఎర్రటి నెత్తురు చుక్కలు ఒక్కొక్కటే పడుతోంది.

నేను బైరాగి ఆదుర్దాగా చూడ సాగాము.

డాక్టరు కుర్చీవేసు కూర్చున్నాడు.

జయిమ్మలో ఏ మార్పూ లేదు బైరాగి కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి. ఆతను జయమ్మలో ఏవేవో వెతుకుతున్నాడు. చాల సంవత్సరాలనుంచి అల్లుకున్న మనసు కన్నీళ్ళను వలికించుతోంది.

నేను బయటకు వచ్చాను. సిగరెట్ వెలిగించాను. లోపలనుంచి ఫాన్ మోత తప్ప మరేమీ వినబడటం లేదు. బయట కూడ గంభీరంగానే వుంది. నల్లటి ఆకాశం మీద చుక్కలు జిరుగుతో అతి కించి వున్నాయి.

వాటివంకే చూస్తూ కూర్చున్నాను.

మరో పది నిమిషాల తర్వాత లోపల నుంచి కెవ్వున కేక వినిపించింది. ఆ కేక బైరాగిది.

కంగారుగా లోపలకు వెళ్ళాను.

బైరాగి జయమ్మ మీద పడి పిచ్చిగా ఏడుస్తున్నాడు.

నర్సు స్టాండు తోసుకుంటూ వెళ్ళి పోయింది.

డాక్టర్ నన్ను చూసి "ఐ యామ్ సారీ, బ్రతికించలేకపోయాను" అన్నాడు. కాని నేను వినే పరిస్థితిలో లేను. బైరా గిని చూడసాగాను. జయమ్మ చచ్చిపోతే బైరాగి ఏందుకు ఏడుస్తాడు? నాకు అర్థం కావటం లేదు. నెమ్మదిగా బైరాగి భుజం మీద చేయి వేసి తట్టాను.

బైరాగి నా వైపు తిరిగి "అంతా అయిపోయింది బాబుగారూ జయమ్మ యిక లేదు" అని ఏడ్వసాగాడు.

బైరాగి కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు. తెరలు తెరలుగా వచ్చే దుఃఖాన్నితుండుతో ఆపుతున్నాడు. కళ్ళ నీళ్ళు పొంగుతూ చెంపల మీదుగా కారుతున్నాయి. పాతిక సంవత్సరాలు ప్రపంచం అంతా పిచ్చిది అని తరిమి కొట్టినదాన్ని ఒడిలో పెట్టు కొని పోషించిన అనుభూతి బైరాగిని విహ్వలుడ్ని చేస్తోంది. కావచ్చు. ఈ మనిషి చిన్న గుండెలో ఎన్నో అగా ధాలు, సుడిగుండాలు వున్నాయి.

నిండా ముసుగు కప్పి వున్న జయ

మ్మను చూస్తే నాకూ దుఃఖం ఆగటం లేదు.

మనిషికి చివరి బాట-యిన్ని సంవత్స రాలు పెరిగిన ఎన్నో అసూయలకు, ద్వేషాలకు, మమతలకు, కలలకు, కన్నీళ్ళకు నిలయమైన శరీరం పూర్తిగా కలిపి వేసే చోటు—

పుల్లలు వరుసగా పేర్చబడ్డాయి. వంకరగా ఎండిపోయినవి కొన్ని తడివి కొన్ని ఒకదాని మీద ఒకటి పేర్చబడ్డాయి. పైన జయమ్మను పడుకోబెట్టారు. పైన యింకా కొన్ని సన్నని పుల్లలు పేర్చారు. వాటి మీద కిరోసిన్ పోశారు.

అగ్గిపెట్టె పట్టుకున్న బైరాగి చేయి ఒణుకుతోంది. అతని ఎర్రబడిన కళ్ళల్లో తీరని ఆవేదన కనబడుతోంది. "బాబూ నా వల్లకాదు. నేను చేయలేను" అంటూ చతికిల పడ్డాడు బైరాగి.

"తప్పదు బైరాగీ! నువ్వే చేయాలి. బాధ కూడ అనవసరం. మనమంతా ఎప్పుడో ఒకసారి చచ్చిపోవలసిన వాళ్ళమే."

చాల చాల చెప్పిన తర్వాత ఒణుకుతున్న చేతులతో అగ్గిపుల్ల వెలిగించాడు.

మరుక్షణంలో మంటలు లేచాయి. ఎర్రటి మంటలు చివర పొగ కొసల నాలుకలతో పైకి పాకుతున్నాయి. వాటి మధ్య జయమ్మ శరీరం కనబడటం



లేదు.

నేను కొంచం దూరంగా చెట్టు క్రింద కూర్చున్నాను. నా వెనుకే బైరాగి వచ్చి కూర్చున్నాడు.

మనిషి చివరిసారి పంచ భూతాల్లో కలిసిపోతున్న దృశ్యాన్ని మరో మనిషి ఆవేదనతో చూస్తున్నాడు. నేను కుతూహలంతో చూస్తున్నాను.

శ్మశానంలో అక్కడక్కడ సగం కాలిన పుల్లలున్నాయి. పగిలిన కుండలు, పాత గుడ్డల పీలికలతో, బొగ్గుల ముక్కలతో శ్మశానం తనని అలంకరించుకొంది. ప్రక్కనే వున్న చేరువలోకి ఎర్రటి మంటలు నీడలు తిరిగి చూస్తున్నాయి.

నాలో ఏవో మసక నీడల మరకలు పడుతున్నాయి. బైరాగి ముఖంలోకి చూస్తూ అడిగాను "బైరాగీ! జయమ్మ చచ్చిపోతే నువ్వు ఎందుకు ఏడుస్తావు?"

బైరాగి అన్నాడు "పాతికేళ్ళు దానికి నా చేత్తో కూడు పెట్టాను. ఆ పిచ్చిది పోయేసరికి నాకు ప్రాణమే పోయినట్టుంది బాబూ!"

"కాదు నువ్వు ఏదో దాస్తున్నావు!"

బైరాగి కళ్ళల్లోంచి నీళ్ళు టప టప రాలిపడ్డాయి. వాటని ఎడమ చేత్తో తుడుచుకొని "ఏమీ దాయటం లేదు బాబూ!" అన్నాడు. కాని నాకు బైరాగిలో ఏధో మరుగుతూ వుందని గమనించాను. అది తెలుసుకోనిదే నాకు తృప్తి లేదు. బైరాగిని చాల విధాలుగా అడిగాను. చివరికి బైరాగి మండుతున్న మంటల్లోకి చూస్తూ చెప్పాడు.

"నాకు జయమ్మ చిన్నప్పటినుంచి తెలుసు బాబయ్యా. జయమ్మ పల్లెలో హుషారయిన పిల్ల, యింకా సెప్పాలంటే మొగమాటం లేని పిల్ల. పల్లె అంతా తిరుగుతూ అందరికీ అంతో యింతో సాయం చేస్తూ అందరికీ తలలో నాలుకలా వుండేది. జయమ్మ అంటే అందరికీ యిష్టమే. అందరికంటే బాగా యిష్టపడింది యాదగిరి. ఆడు జయమ్మంటే పడి చచ్చేవాడు. అది కనపడకపోతే ఆడు గిల గిల కొట్టుకొనేవాడు. అది ఎక్కడికి పోతే ఈడు అక్కడికే తయారు. అది ఏ పనిలోకి పోతే ఈడూ ఆ పనిలోకే పోయేవాడు. చెట్టులని పుట్టలని రోజూ దాన్ని తిప్పేవాడు నవ్వించేవాడు, కవ్వించేవాడు. ఏడ్పించేవాడు. ఎత్తుకు తిరిగేవాడు. జయమ్మకు, యాదగిరికి పెళ్ళి చేయాలని పల్లెలో అంతా యిష్టపడుతూ వుండేవారు. వాళ్ళిద్దరికీ పెళ్ళి చేసే స్తే చిలకా గోరింకల్లాగ వుంటారని, రాముడు సీతలాగ వుంటారని పల్లెలో అనుకొనేవారు. కాని అట్టా జరగలేదు. వాళ్ళిద్దరికి పెళ్ళి చేయటానికి జయమ్మ బాబు యిష్టపడలేదు. ఆడో కటిక దుర్మార్గుడు. జయమ్మకు దూరపు మనువు వుందని సింహాద్రితో కుదిర్చాడు. సింహాద్రి ఒట్టి ఎదవనాయాల. ఆడు పట్నంలో రిక్షా లాగుతూ వుండేవాడు. ఆడు సంపాదించినదంతా

పొద్దుగూకేలకి తాగుడికి, ముక్కాటికి పెట్టేసేవాడు. సుక్కలాంటి జయమ్మను ఆడికివ్వటం అన్యాయం. కాని జరిగి పోయింది. మనువురోజు వరకు జయమ్మను దాని బాబు గడప దాటనివ్వలేదు. యాదగిరితో మాట్లాడనివ్వలేదు. దాని పెళ్ళి సింహాద్రితో జరిగిపోయింది."

"సింహాద్రికి యాదగిరి సంగతి తెలిసే చేసుకున్నాడా?" అడిగాను నేను

"ముందు తెలియదు బాబయ్యా! తెలిస్తే ఎంత త్రాగుబోతు అయినా మనసు వుంటుంది గందా! కాని ఆడికి మొదట రాత్రే తెలిసింది"

"మొదటి రేత్తిరి జయమ్మ సింహాద్రి కాళ్ళమీద పడి ఏడిసింది. నన్ను ముట్టుకో వద్దంది. తనూ యాదగిరి ఏనాడో మనసుతో మనువాడుకున్నారని, మనసు శరీరం ఆడి కొక్కడికే అని చెప్పింది ఆ మాటలకి సింహాద్రి ఎంతో కరిగి పోయాడు. అన్నాయంగా ముసలి ముండా కొడుకు మాటలు విని జయమ్మను గొంతు కోశానే అని బాధ పడ్డాడు ముసిలాడ్ని చితక తన్ని జయమ్మను యాదగిరికి మారు మనువు చేత్తానని వప్పించాడు. కాని యాదగిరి దొరకలేదు, ఆడు రెండు రోజులకు ముందే పల్లె విడిచి దేశం మీదకు పారిపోయాడు అప్పటి నుంచి అంటే పాతికేళ్ళ నుంచి జయమ్మకు పిచ్చెక్కి ఈ స్టేషనులోనే కాపరం పెట్టింది ఎప్పుడో ఒకసారి యాదగిరి రైల్లో దీనికోసం వస్తాడని ఎదురు చూసేది బాబయ్యా. దాని కోరిక తీర కుండానే పోయింది"

బైరాగి కళ్ళు తుడుచుకున్నాడు.

మంటలు యింకా మండుతూనే వున్నాయి. నాటి వంక బైరాగి జాలిగా చూడసాగాడు.

"అయితే సింహాద్రి ఏమయ్యాడు?" చటుక్కున అడిగాను.

నా ప్రశ్నకు ఉలిక్కిపడ్డాడు బైరాగి. విశాలంగా పరుచుకున్న ఆకాశం వంక చూస్తూ "నేనే సింహాద్రిని బాబూ!" అన్నాడు

ఉచితం! ఉచితం!! ఉచితం!!!

తెల్ల మచ్చలు

కోత, కాలుట, దురద, గజ్జి లేక మరే కారణమువలన ఏర్పడిన తెల్ల మచ్చలకయినా 'స్వీటారి' ఉత్తమ ఔషధము. ఒక పాకెట్ ఉచితం, ఇంగ్లీషులో వ్రాయండి.

SRI KRISHNA CHANDRA VAIDYA (64)
P. O KATRI SARAI (Gaya)